క్లుప్తంగా

మహానందీశ్వర దంపతులకు పల్లకీసేవ



మహానందిలో పల్లకీసేవ దృశ్యం

మహానంది: కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వార్లకు శుక్రవారం రాత్రి ఈఓ కాపు చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు రవిశంకర అవధాని, అర్చకులు శరభయ్యశర్మ పల్లకీసేవను వైభవంగా నిర్వహించారు. అమ్మవారి ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి అలంకార మండపంలో గణపతిపూజ, పుణ్యాహవాచనం, అలంకారపూజ, హారతిపూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాకారాల్లో పల్లకీ ఉత్సవం జరిపించారు. పలు ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి పల్లకీని మోస్తూ భక్తిశ్రద్ధలతో పూజలు చేపట్టారు.

క్రికెట్ విజేత గాజులపల్లె



విజేతగా నిలిచిన గాజులపల్లె జట్టు

మహానంది: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీల్లో భాగంగా గాజులపల్లె సెక్రటేరియట్ టీం విజయం సాధించినట్లు ఎంపీడీఓఓ శివ నాగజ్యోతి తెలిపారు. గెలిచిన క్రీడాకారులను శుక్రవారం అభినందించారు.

మహానందిని పరిశుభ్రంగా ఉంచుకుందాం



ఆలయ ప్రాంగణంలో పరిశుభ్రత పనులు చేపడుతున్న దృశ్యం

మహానంది: మహానంది ఆలయాన్ని పరిశుభ్రంగా ఉంచుకునేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆలయ ఈఓ కాపు చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. పీఎం మోదీ పిలుపు మేరకు దేవదాయ శాఖ నిర్వహిస్తున్న స్వచ్ఛ తీర్థ కార్యక్రమాన్ని శుక్రవారం సాయంత్రం మహానందిలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ పరిసరాల్లో పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ప్లాస్టిక్ రహిత మహానందిగా తీర్చిదిద్దడానికి భక్తులు, వ్యాపారులు సహకరించాలన్నారు. దేవస్థానం సూపరింటెండెంట్ ఓంకారం వెంకటేశ్వరుడు, సిబ్బందితో పాటు సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలి

పాములపాడు: మండలంలోని బానకచెర్ల, గుండాలనట్టు గ్రామంలో ఇళ్లు లేని నిరుపేదలకు ఇంటి పట్టాలు ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రంగనాయుడు డిమాండ్ చేశారు. శుక్రవారం బానకచెర్ల గ్రామంలో ఇళ్ల స్థలాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ 5 ఏళ్ల నుంచి స్థలాలను ఆధీనంలో ఉంచుకొని గుడిసెలు నిర్మించుకున్నారని, వారికి వెంటనే అధికారులు పరిశీలించి ఇంటి పట్టాలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు రమేష్, వెంకటశివుడు, ప్రతాప్, ఏసేపు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు కల్పించండి

మహానంది: అర్హులందరికీ ఉపాధి పనులు కల్పించాలని జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ బాలాజీ సూచించారు. బండిఆత్మకూరు మండలంలోని ఉపాధి కార్యాలయంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడు తూ పనులు కల్పించడంతో పాటు పనికి తగిన వేతనం కల్పించేందుకు సిబ్బంది ప్రణాళికలు రూపొందించాలన్నారు. సమావేశంలో ఏపీఓ వసుదారెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

సౌత్ ఇండియా క్రికెట్ పోటీలకు ఎంపిక



ఎంపికైన ఓంకార్

నంద్యాల(న్యూటౌన్): ఈనెల 23 నుంచి ఫిబ్రవరి 12వ తదీ వరకు గోవాలో జరిగే సౌత్ ఇండియా అండర్-14 క్రికెట్ పోటీలకు నంద్యాల పట్టణంలోని ఎస్పీవై రెడ్డి పాఠశాల విద్యార్థి కేవీ ఓంకార్ ఎంపికైనట్లు నంది గ్రూప్ ఆఫ్ సంస్థ ఎండీ సుజల, పాఠశాల ప్రిన్సిపాల్ మదన్ తెలిపారు. శుక్రవారం వారు మాట్లాడుతూ గుంటూరులో ఈనెల 13, 14, 15 తేదీల్లో అండర్-14 క్రికెట్ పోటీల్లో ఓంకార్ ప్రతిభ చూపి సౌత్ ఇండియా క్రికెట్ పోటీలకు ఎంపిక కావడం అభినందనీయమన్నారు. విద్యార్థిని ఉపాధ్యాయులు, సిబ్బంది, తల్లిదండ్రులు, కోచ్ ప్రసన్న అభినందించారు.

ఉపకార వేతనాల పంపిణీ

నంద్యాల(వ్యవసాయం): నంద్యాల దివ్యాంగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక కార్యాలయంలో సంఘం గౌరవాధ్యక్షుడు డాక్టర్ రవికృష్ణ అధ్యక్షతన ఉపకార వేతనాలు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ నంద్యాలకు చెందిన ప్రముఖ ఆర్యవైశ్య నాయకుడు గోళ్లరాజేష్ సౌజన్యంతో ఆరుగురు దివ్యాంగ విద్యార్థులకు రూ.20వేలు పంపిణీ చేశారు. సంఘం నాయకులు రమణయ్య, వెంకటరావు పాల్గొన్నారు.

సురక్ష వైద్య శిబిరాలు పేదలకు వరం

జూపాడుబంగ్లా: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు పేదలకు వరమని ఎంపీడీఓ నూర్జహాన్, డాక్టర్ యశస్విని, ఈఓపీఆర్డీ మధుమోహనచక్రవర్తి తెలిపారు. శుక్రవారం మండలంలోని పారుమంచాల గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పైసా ఖర్చులేకుండా పేదలకు కార్పొరేట్ వైద్యం అందించాలన్న సంకల్పంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారన్నారు. గ్రామాల్లో వైఎస్సార్ హెల్త్‌క్లినిక్‌ల ఏర్పాటు, ఫ్యామిలీ డాక్టర్ వంటి కార్యక్రమాల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజల ఇళ్ల వద్దకు వైద్యులు వెళ్లి వైద్యం అందించేలా చేసిన ఏకైక సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. అనంతరం అవసరమైన వారికి కంటి అద్దాలు, మందులు అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి విజయ్‌కుమార్ పాల్గొన్నారు.



వృద్ధురాలికి కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది



పారుమంచాలలో ఓపీ కోసం బారులు తీరిన గ్రామస్తులు

ఎం. ఘణపురంలో..

పగిడ్యాల: మండలంలోని ఎం. ఘణపురం సచివాలయం వద్ద శుక్రవారం సర్పంచ్ ప్రతాపరెడ్డి అధ్యక్షతన జగనన్న ఆరోగ్య సురక్ష రెండవ విడత క్యాంప్‌ను నిర్వహించారు. గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్న ఆశయంతో ప్రభుత్వం నిర్వహిస్తున్న ఆరోగ్య క్యాంప్‌లను సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ కోరారు. అనంతరం వైద్యులు కృష్ణమూర్తి ఆధ్వర్యంలో జరిగిన క్యాంప్‌లో 474 మంది రోగులకు వైద్యులు వైద్య సేవలు అందించారు.

బి.కోడూరు గ్రామంలో..

మహానంది: పేదల ఆరోగ్యం కోసం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని జగనన్న ఆరోగ్య సురక్ష డివిజన్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కాంతరావునాయక్ తెలిపారు. బండిఆత్మకూరు మండలం బి.కోడూరు గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా 514 మంది ఓపీ నమోదు చేసుకోగా 326 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ భువన, డాక్టర్ జగదీష్ పాల్గొన్నారు.

● మిడుతూరులో..

మిడుతూరు: జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రజలకు ఎంతో మేలు చేకూరుతుందని మండల ఎంపీడీఓ జీఎన్ఎస్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని మిడుతూరు గ్రామ సచివాలయం-1 పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంపును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇంటి వద్దకే వైద్యం అందించాలనే ఉద్దేశంతోనే జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంపులను నిర్వహిస్తుందన్నారు. ఈ ఆరోగ్య సురక్ష క్యాంపులను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ జయలక్ష్మి, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ తువ్వా శివరామకృష్ణారెడ్డి, వైద్యులు సురేష్‌బాబు, రాజు, భరత్ పాల్గొన్నారు.



మిడుతూరులో ఆరోగ్య సురక్ష క్యాంపును పరిశీలిస్తున్న అధికారులు

● పెద్దగుమ్మడాపురంలో..

కొత్తపల్లి: మండలంలోని ఎర్రమఠం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని పెద్దగుమ్మడాపురంలో వైద్యాధికారి జబీర్‌బాషా ఆధ్వర్యంలో రెండవ విడత జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపు నిర్వహించారు. ఎంపీడీఓ మేరీ, సర్పంచు నక్క విజయ్ కుమార్ వైద్య శిబిరాన్ని పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణులకు గ్రామాల్లోనే కార్పొరేట్ స్థాయిలో వైద్యం అందించాలన్న సంకల్పంతో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను నిర్వహిస్తుందన్నారు. శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు సూచించారు. అనంతరం మందులు, కళ్లద్దాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచు బొల్లు శ్రీనివాసులు యాదవ్, డాక్టర్లు విజయేంద్ర, హకీమ్ రషీద్, ప్రసన్నలక్ష్మి, వైద్య, ఆరోగ్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



కంటి అద్దాలు పంపిణీ చేస్తున్న ఎంపీడీఓ, డాక్టర్లు, ప్రజాప్రతినిధులు

ముగిసిన శిక్షణా కార్యక్రమం



మాట్లాడుతున్న ఎంపీడీఓ వెంకటరమణ

పగిడ్యాల: గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక తయారీపై స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో చేపట్టిన శిక్షణా కార్యక్రమం శుక్రవారం ముగిసింది. ఈనెల 17న ఎంపీడీఓ వెంకటరమణ అధ్యక్షతన అన్ని శాఖల మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు, సర్పంచ్‌లు, వార్డు సభ్యులు పాల్గొన్నారు. అభివృద్ధి ప్రణాళిక తయారీలో 9 అంశాలను పరిగణలోకి తీసుకోవాలని అవగాహన కల్పించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో తయారు చేసిన ప్రణాళికలకు పంచాయతీ తీర్మానాలు తీసుకుని ఈ గ్రామ స్వరాజ్ పోర్టల్‌లో ఆన్‌లైన్ చేయాలని ఆదేశించారు. నిర్ణీత గడువులోగా అభివృద్ధి ప్రణాళిక తయారీ ప్రక్రియను పూర్తి చేయాలని ఎంపీడీఓ కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ క్రాంతి పథం ఏరియా కో ఆర్డినేటర్ దేగలయ్య, ఏపీఎం శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

అలరించిన భజన కార్యక్రమం



భక్తిగీతాలను ఆలపిస్తున్న కళాకారులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానంలో నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా ఆలయ దక్షిణ మాఢవీధిలోని నిత్యకళావేదికపై పల్నాడు జిల్లాకు చెందిన వారిచే శుక్రవారం నిర్వహించిన భజన కార్యక్రమం భక్తులను ఆకట్టుకుంది. కార్యక్రమంలో శివశివ శంకరా, నమఃపార్వతి, శివ శివ అనరాదా, శివనామమే, శంభోమహేశ తదితర పలు భక్తి గీతాలకు, అష్టకాలు మొదలైన వాటిని బి.కోటేశ్వరరెడ్డి, ఎం.వెంకటేశ్వర్లు, పి.శ్రీనివాసరెడ్డి, ఎ.యల్లామందారెడ్డి, చిన్న వెంకటేశ్వర్లురెడ్డి, ఎ.బాలిరెడ్డి, నాగరాజారెడ్డి, ఎస్.కృష్ణారెడ్డి తదితరులు ఆలపించారు.

తెలుగువారు గర్వపడే కవి వేమన

నంద్యాల(వ్యవసాయం): తెలుగువారు గర్వపడే కవి వేమన అని మాతృభాష పరిరక్షణ సమితి అధ్యక్షుడు దీవి హయగ్రీవాచారి, విశ్రాంత శాస్త్రవేత్త డాక్టర్ రవీంద్రనాథ్ పేర్కొన్నారు. శుక్రవారం మాతృభాష పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో స్థానిక కార్యాలయంలో యోగి వేమన జయంతిని నిర్వహించారు. ముందుగా వేమన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సాహితీ వేత్తలచే యోగివేమన పద్యాలు-వ్యక్తిత్వ వికాసం అనే అంశాలపై సదస్సు నిర్వహించారు. రమణమూర్తి, శ్రీనివాసమూర్తి, అన్నెం శ్రీనివాసరెడ్డి, మద్దిలేటి, నీలకంఠేశ్వర్లు, డాక్టర్ కిశోర్‌కుమార్, శివారెడ్డి, సుబ్బయ్య పాల్గొన్నారు.

పరామర్శ

నందికొట్కూరు రూరల్: మండలంలోని శాతనకోట గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త అల్వాల రామక్రిష్ణారెడ్డి(70) శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ గ్రామానికి వెళ్లి మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు.

పశువుల మెడికల్ క్యాంపు ఏర్పాటు చేయండి

నందికొట్కూరు: ప్రతి సోమవారం జరిగే పశువుల సంతకు వెటర్నరీ మొబైల్ క్యాంపు ఏర్పాటు చేయా లని మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ షేక్ రహత్ జబ్బా ర్ సూచించారు. శుక్రవారం మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రతి సోమవారం పశువుల సంతకు వివిధ ప్రాంతాల నుంచి సుమారు 2 వేల పశువులు వస్తాయన్నారు. ఒక్కోసారి పశువులు సంతలోనే ఈను తాయన్నారు. ఆ సమయంలో వైద్యులు అందుబాటులో ఉంటే వైద్యం అందించవచ్చన్నారు.

కార్యకర్తల సమావేశం విజయవంతం చేయండి

నందికొట్కూరు: నంద్యాల జిల్లా కేంద్రంలో బీజేపీ ముఖ్య కార్యకర్తల సమావేశం విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి గూడూరు రవికుమార్‌రెడ్డి కోరారు. శుక్రవారం పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికల సమయం దగ్గరలో ఉందని బీజేపీ అభ్యర్థుల ఎంపికలో కార్యకర్తల అభిప్రాయాలను తెలుసుకునేందుకు జిల్లా స్థాయి సమావేశం నిర్వహిస్తునట్లు చెప్పారు. ఈ నెల 21న నంద్యాల పట్టణంలోని శ్యామకాల్వ సమీపంలో జరిగే ముఖ్య కార్యకర్తల సమావేశానికి బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి హాజరవుతున్నారన్నారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలి రావాలని కోరారు. సమావేశంలో బీజేపీ జిల్లా నాయకులు కృష్ణయాదవ్, స్థానిక నాయకులు రాంబాబు, శ్రీకాంత్, వేణు, రాముడు తదితరులు పాల్గొన్నారు.

సేవా దృక్పథమే విద్యార్థులకు మణిహారం



మాట్లాడుతున్న అసోసియేట్ డీన్ నాయక్

గోస్పాడు: సేవా దృక్పథమే విద్యార్థులకు మణిహారమని మహానంది వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ నాయక్ అన్నారు. మండలంలోని నెహ్రూనగర్ గ్రామంలో శుక్రవారం జాతీయ సేవా పథకం ప్రత్యేక శిబిరాన్ని ఎన్ఎస్ఎస్ ఇన్‌చార్జి డాక్టర్ సరోజినిదేవి ఆధ్వర్యంలో నిర్వహించారు. వారు మాట్లాడుతూ గ్రామంలో వారం రోజుల పాటు అగ్రికల్చర్ బీఎస్సీ నాల్గవ సంవత్సరం విద్యార్థులు రోజువారి కార్యక్రమాలు చేపడతారని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి స్వప్నిక, వెటర్నరీ డాక్టర్ కిశోర్‌కుమార్‌రెడ్డి, ఏరువాక శాస్త్రవేత్త బాలాజీనాయక్, డాక్టర్ సంతోష్‌నాయక్, గ్రామ రైతులు పాల్గొన్నారు.

దుకాణాల వేలంలో ఆదాయం

నంద్యాల(సిటీ): పట్టణంలోని పలు ప్రాంతాలలోని 32 దుకాణాలకు సంబంధించి శుక్రవారం బహిరంగ వేలంను మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వెంకటదాసు ఆధ్వర్యంలో నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయంలోని రెవెన్యూ సెక్షన్‌లో నిర్వహించిన వేలంలో 6 దుకాణాలను దక్కించుకునేందుకు మాత్రమే వ్యాపారులు ముందుకు రాగా.. మిగిలిన దుకాణాల వేలం వాయిదా పడిందని ఇన్‌చార్జ్ ఆర్ఓ వెంకటకృష్ణ తెలిపారు. ఆర్ఓ మాట్లాడుతూ ఆరు దుకాణాలకు సంబంధించి గతానికంటే అధిక మొత్తంలో ఆదాయం సమకూరిందన్నారు. ముఖ్యంగా ఎన్టీఆర్ కాంప్లెక్స్‌లోని గతంలో నెలకు రూ.6వేలు బాడుగ చెల్లించేవారని ప్రస్తుతం ఓ దుకాణం రూ.26వేలకు పాటదారుడు దక్కించుకున్నారన్నారు. అలాగే ఇదే కాంప్లెక్స్‌లో రూ.22వేలకు మూడు దుకాణాలు రూ.22,500కు మరో దుకాణం, రూ.26 వేలకు ఒక దుకాణాన్ని పాటదారులు దక్కించుకున్నారని దీంతో మున్సిపాలిటీకి అధికంగా ఆదాయం లభించింది. ఇక నూనెపల్లెలోని మటన్ షాప్ గతంలో రూ.4వేలు అద్దె చెల్లించే వారని, ప్రస్తుతం రూ.5వేలకు దక్కించుకున్నారని వివరించారు. వాయిదా పడిన దుకాణాల వేలంలో పాల్గొనదలచే వ్యాపారులు సాల్వెన్సీ, గుడ్‌విల్, డిపాజిట్‌లతో పాటు అన్ని రకాల ధ్రువపత్రాలతో పాల్గొనాలని కోరారు. ఆర్ఐ గులాంహుస్సేన్, యుగంధర్, సిబ్బంది ఉన్నారు.



నూనెపల్లె మటన్ షాప్‌ను దక్కించుకున్న వ్యాపారస్తుని ధ్రువపత్రాలను పరిశీలిస్తున్న అధికారులు

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మహానంది: మండల పరిధిలోని 13 గ్రామ పంచాయతీలకు శనివారం ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఇంజినీర్ ప్రభాకర్ రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ విద్యుత్ సబ్ స్టేషన్లలో జరగనున్న మరమ్మతులు, మెయింటెనెన్స్ కారణంగా విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నామని వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు ఎమ్మెల్యే శిల్పా పర్యటన

మహానంది: ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఎథిక్స్ కమిటీ చైర్మన్, శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి శనివారం బండిఆత్మకూరు మండలంలో పర్యటించనున్నారని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బారెడ్డి శ్రీనివాసరెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ బి.కోడూరు, వెంగళరెడ్డిపేట, కడమల కాలువ, సోమయాజులపల్లి, శింగవరం, లింగాపురం గ్రామాల్లో నిర్మించిన రైతు భరోసా కేంద్రాలు, సీసీ రోడ్లు తదితర అభివృద్ధి పనులను ప్రారంభించనున్నారన్నారు.

ఎంపీటీసీ మాజీ సభ్యుడికి పుత్ర వియోగం

పాములపాడు: ఎంపీటీసీ మాజీ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ మండల మాజీ కన్వీనర్ చౌడయ్య కుమారుడు నాగరాజు(31) గుండెనొప్పితో శుక్రవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే తొగురు ఆర్థర్, మాజీ ఎమ్మెల్యే ఐజయ్య, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రామలింగేశ్వరరెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ నాగరాజు తదితరులు నాగరాజు మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. చౌడయ్యను, కుటుంబ సభ్యులను పరామర్శించారు.

అయోధ్యకు కాకనూరు శారదాపీఠాధిపతి

మహానంది: అయోధ్యలో ఈనెల 22న జరగనున్న శ్రీరాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ట కార్యక్రమానికి బండిఆత్మకూరు మండలం కాకనూరు గ్రామంలోని శారద పీఠం పీఠాధిపతి శివయోగేంద్ర సరస్వతి స్వామికి ఆహ్వానం అందింది. భారత దేశ వ్యాప్తంగా సుమారు 1,800 మందికి పైగా పీఠాధిపతులు హాజరుకానున్నారని ఆయన తెలిపారు. శుక్రవారం ఆయన అయోధ్యకు బయలుదేరి వెళ్లారు.

డోన్ రైల్వే స్టేషన్‌ను తనిఖీ

డోన్ రూరల్ : పట్టణంలోని రైల్వే స్టేషన్‌ను శుక్రవారం రైల్వే ఎస్‌డీజీఎం అరవింద్‌మల్కేదే తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రైల్వే స్టేషన్‌లో సమస్యలపై సంబంధిత ఉద్యోగులను అడిగి తెలుసుకున్నారు. అలాగే స్టేషన్‌లో వసతుల పరిశీలించారు. రెస్ట్ రూం, అతిథి భవనాన్ని పరిశీలించారు. రైల్వే ప్రయాణికులకు అన్నివసుతలను ఉండేలా చూసుకోవాలని సూచించారు.



రైల్వే స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఎస్‌డీజీఎం అరవింద్‌మల్కేదే

ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం సురక్షితం



విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

డోన్ టౌన్ : ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించడం క్షేమం, సురక్షితం అని డిపో మేనేజర్ శశిభూషణ్ అన్నారు. స్థానిక బస్టాండ్ ఆవరణంలో శుక్రవారం లక్కీ డిప్ తీసి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ నెల 1వ తేది నుంచి 15వ తేది వరకు ప్రయాణించిన వారి టిక్కెట్లను లాటరీ తీశారు. పట్టణంలోని పాతపేటకు చెందిన శ్రీదేవి, వెంకటేశ్వర్లు మొదటి, రెండవ బహుమతులు, కర్నూల్‌కు చెందిన హనుమంతు మూడవ బహుమతి అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ లాజెర్స్ తదితరులు పాల్గొన్నారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు

బనగానపల్లె రూరల్ : మండలంలోని నందవరంలో గురువారం ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన అనాథ వృద్ధుడి మృత దేహానికి శుక్రవారం బనగానపల్లె ఐఎంఎం ఆర్గనైజేషన్ సభ్యులు ముస్లిం సంప్రదాయ ప్రకారం అంత్యక్రియాలు నిర్వహించారు. వృద్ధుడి సంబందించిన బంధువులు ఎవరు రాక పోవడంతో అవుకుమెట్ట వద్ద ఉన్న ముస్లిం శ్మశానవాటిలో సభ్యులు నిర్వహించారు. కార్యక్రమంలో ఐఎంఎం నాయకులు కటిక కరీముల్లా, అత్తార్ మహబూబ్‌బాషా, షేక్ గౌండవలి, ఫారూఖీ తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందజేయాలి

బేతంచెర్ల: గ్రామీణ ప్రాంతాల్లో అత్యవసర వేళల్లో బాధితులకు ప్రథమ చికిత్సలో భాగంగా మెరుగైన వైద్య సేవలు అందజేయాలని గ్రామీణ వైద్యుల సంక్షేమ(ఆర్ఎంపీ) సంఘం రాష్ట్ర అధ్యక్షులు రాధాకృష్ణ, కర్నూలు, నంద్యాల జిల్లాల అధ్యక్షులు శ్రీనివాసులు, నాగేశ్వర్‌రెడ్డి అన్నారు.శుక్రవారం పట్టణానికి సమీపాన కొలుములపల్లె రహదారిలోని చౌడేశ్వరి మాత ఆలయం ఆవరణలో గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం జిల్లా కోశాధికారి నాగసురేంద్ర ఆధ్వర్యంలో గ్రామీణ వైద్యుల సమావేశం నిర్వహించారు. గ్రామీణ వైద్యుల పోరాట సభ గౌరవ అధ్యక్షులు గోవిందరెడ్డి చేతుల మీదుగా ఫిబ్రవరి 4న విజయవాడలో జరిగే గ్రామీణ వైద్యుల మహాసభ పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో గ్రామీణ వైద్యులు వరప్రసాద్, కృష్ణ, లక్ష్మన్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

వేధింపుల కేసు నమోదు

బేతంచెర్ల: అదనపు కట్నం కోసం భర్త, అత్త, మామ, మరిది వేధింపులకు పాల్పడుతున్నారని పట్టణానికి చెందిన ఓ మహిళ ఫిర్యాదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ సజ్జద్ అలి తెలిపారు. భార్గవిని కడప పట్టణానికి చెందిన నవీన్‌తో 2022 మే 6న వివాహం చేశారు. కొంత కాలంగా భర్త నవీన్, అత్త ఇంద్రావతి, మామ రామకృష్ణ, మరిది కిశోర్ కుమార్ అదనపు కట్నంతో పాటు బైక్ కొనివ్వాలని వేధింపులకు గురిచేస్తున్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

ఘనంగా చౌడేశ్వరిదేవి పల్లకీ సేవా

బనగానపల్లె రూరల్ : నందవరం చౌడేశ్వరిదేవి అమ్మవారికి శుక్రవారం పల్లకీసేవా ఘనంగా జరిగింది. ఈఓ రామానుజన్, ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో ఉదయం శ్రీ చౌడేశ్వరిదేవి పూజలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని అలంకరించి పల్లకీ సేవ నిర్వహించారు.

కులగణన ప్రారంభం



కులగణన సర్వే ప్రక్రియను పరిశీలిస్తున్న ఎంపీడీఓ నూర్జహాన్, సర్పంచ్ బాలస్వామి

కొత్తపల్లి: మండలంలో శుక్రవారం కులగణన ప్రారంభమైంది. 11 గ్రామ సచివాలయాల పరిధిలో మొత్తం 32 గ్రామాలున్నాయి. వలంటీర్లు, సచివాలయ సిబ్బంది ఇంటింటికి వెళ్లి బీసీ, ఎస్సీ, ఎస్టీ ఇతర కులాలపై వివరాలు సేకరిస్తున్నారు. కుటుంబ సభ్యుల వివరాలు, చిన్నపిల్లలు, పశువులు, ఇతరత్రా వివరాలు సేకరించి ఆన్‌లైన వెబ్‌సైట్‌లో పొందుపరుస్తున్నారు. ఈనెల 28వ తేదీ వరకు సర్వే జరుగుతుందని ఎంపీడీఓ మేరి తెలిపారు.

● నందికొట్కూరు రూరల్: కుల గణనను పక్కాగా నిర్వహించాలని ఈఓఆర్డీ సంజన్న సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని నాగటూరు గ్రామంలో సచివాలయ సిబ్బంది, వలంటీర్లు నిర్వహిస్తున్న కులగణన సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వేకు సంబంధించిన వివరాలను తప్పుల్లేకుండా నమోదు చేయాలని, ఏవైనా అభ్యంతరాలు ఉంటే ఉన్నతాధికారులకు తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రవీంద్రబాబు పాల్గొన్నారు.

● పగిడ్యాల: ఆర్థిక, సామాజిక, సాధికారత దిశగా ప్రభుత్వ పథకాలు అన్ని వర్గాలకు అందించాలనే లక్ష్యంతో మండలంలో శుక్రవారం కుల గణన సర్వే ప్రారంభమైంది. 85 మంది గ్రామ కార్యదర్శులు సర్వేలో పాల్గొన్నారని ఎంపీడీఓ వెంకటరమణ తెలిపారు. సర్వర్ బిజీగా ఉన్నందున ఒక్కొక్క ఇంటి వద్ద 15 నిమిషాలకు పైగా సమయం తీసుకుంటుందన్నారు. మండల వ్యాప్తంగా 11,193 కుటుంబాలు ఉండగా 67 కుటుంబాలలో ఎన్యుమరేటర్లు సర్వే పూర్తి చేసినట్లు తెలిపారు. పగిడ్యాల కుంట వీధిలో జరిగే సర్వేను ఎంపీడీఓ పర్యవేక్షించి యాప్ పనితీరును తెలుసుకున్నారు. యాప్‌లో డిస్‌ప్లే అయ్యే ప్రతి అంశాన్ని కుటుంబ సభ్యుల నుంచి రాబట్టి నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఉపేంద్రారెడ్డి, వెల్ఫేర్ అసిస్టెంట్ గణేష్, డిజిటల్ అసిస్టెంట్ అశోక్ పాల్గొన్నారు.



కుల గణన సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ వెంకటరమణ

● జూపాడుబంగ్లా: పకడ్బందీగా కులగణన సర్వే చేయాలని ఎంపీడీఓ నూర్జహాన్ సర్వే సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం మండలంతో పాటు మండలంలోని 12 గ్రామ పంచాయతీల్లో వలంటీర్లు కులాల వారీగా జనాభా వివరాలు సేకరిస్తున్నట్లు తెలిపారు. సర్వే సిబ్బంది ఇంటింటికి వెళ్లి వారి కులం, కుటుంబ సభ్యుల పేరుతో పాటు యాప్‌లో ఇచ్చిన వివరాలను క్షుణ్ణంగా ఆన్‌లైన్‌లో పొందుపర్చాలన్నారు. సర్వే చేస్తున్న సిబ్బంది సర్వే వివరాలను ఎక్కడా బహిర్గతం చేయరాదన్నారు. సర్వే ప్రక్రియ మొత్తం ఆన్‌లైన్‌లో జరుగుతున్నందున సర్వే వివరాలను బహిర్గతం తగదన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మొట్టె బాలస్వామి, కార్యదర్శి మణికంఠ, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

గడ్డివాముల దగ్ధం

చాగలమర్రి: మండలంలోని గొడిగనూరులో శుక్రవారం ప్రమాదవశాత్తూ నిప్పంటుకొని రెండు గడ్డివాములు కాలిపోవడంతో ఇద్దరు రైతులకు రూ.80 వేల నష్టం వాటిల్లింది. బాధితుల వివరాలు.. తలారి చిన్నయ్య, పురుషోత్తంల గడ్డివాములకు నిప్పంటుకోవడంతో ఆళ్లగడ్డ అగ్నిమాపక దళ అధికారి వీరారెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను ఆర్పివేశారు.